క్లుప్తంగా

'రాస్తారోకోకు తరలిరండి'

ఇంద్రవెల్లి: రైతులు పండించిన పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఇంద్రవెల్లిలో నిర్వహించే రాస్తారోకో కార్యక్రమానికి కార్యకర్తలు, రైతులు తరలి రావాలని కాంగ్రెస్ ఖానాపూర్ నాయకుడు వినోద్ నాయక్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ రైతుల పక్షాన ఉండి పోరాడుతుందన్నారు. రైతులు పండించిన పత్తికి రూ. 10 వేలు గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

బేల: వినియోగదారులు ప్రతినెల సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతినెల విద్యుత్ వినియోగపు రీడింగ్ అధారంగా మీటరు రీడర్ ఇచ్చే బిల్లు రశీదుకు అనుగుణంగా నిర్ణీత 15రోజుల్లోగా చెల్లించాలన్నారు. జాప్యం చేస్తే జరిమానాలు, అదనపు ఛార్జీలు పడుతాయని సూచించారు. బిల్లు పెండింగ్‌లో ఉంటే కనెక్షన్ కట్ చేయడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

నేరడిగొండ: హైదరాబాద్‌లోని బంజారా భవనంలో ఈనెల 12న జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని గిరిజన లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కోరారు. ఆదివారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ కోశాధికారి వినేష్ రాథోడ్, నాయకులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

నేరడిగొండ: మండలంలోని శంకరాపూర్ గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ బహుమతులను ప్రదానం చేశారు. ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, మండడి శంకర్, తొడసం శంకర్, మాజీ సర్పంచ్ పుల్ సింఘ్, పవన్, నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా హీరాసుక్క జయంతి



జయంతిలో పాల్గొన్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చాందూరి గ్రామంలో హీరాసుక్క జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ రక్షణ సమితి పార్లమెంట్ కన్వీనర్ నందు చందేకార్ మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ రాబోయే తరాలకు అందించాలన్నారు. హస్నాపూర్ నుంచి చాందూరి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంకిషన్, దేవురావు, సంజీవ్, నాగోరావు పాల్గొన్నారు.

భూమయ్య మహరాజ్ పుణ్యతిథి

జైనథ్: మండలంలోని బాలాపూర్ గ్రామంలో భూమయ్య మహరాజ్ పుణ్యతిథి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి పాదుకలను పల్లకిలో ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామంలో గురుసాహెబ్ మందిరాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు కేఆర్ విశ్వజిత్ నాయక్ (అడ్వకేట్), ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ గీత కరణ్‌సింగ్ పాల్గొన్నారు.

నాందేడ్ సభ సక్సెస్



నాందేడ్ సభలో జెడ్పీటీసీ, బీఆర్ఎస్ శ్రేణులు

నేరడిగొండ: అందరి సమిష్టి కృషితో ఆదివారం నిర్వహించిన నాందేడ్ సభ విజయవంతమైందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. తొలిసారిగా తెలంగాణ వెలుపల జరిగిన సభ కోసం నాందేడ్‌కు రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. జాతీయ స్థాయిలో బీఆర్ఎస్‌కు అనూహ్య స్పందన వస్తుందన్నారు.

వైభవంగా రాములగుట్ట జాతర



భక్తులతో కిక్కిరిసిన గుట్ట ప్రాంతం



కల్యాణాన్ని జరిపిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

తాంసి మండలంలోని పొలోది గ్రామశివారులోని రాములగుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రుల జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం, భజన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతర చివరి రోజు శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. తాంసి, భీంపూర్ మండలాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయివైకుంఠ ట్రస్టు చైర్మన్ రవికిరణ్ యాదవ్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుట్ట ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. జాతరలో వెలిసిన దుకాణాల్లో సందడి నెలకొంది. ఎటువంటి ఘటనలు జరగకుండా రూరల్ సీఐ రఘుపతి, భీంపూర్ ఎస్సై రాధిక, తాంసి ఏఎస్సై స్వామి ముందస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ శంకర్, గ్రామపెద్దలు సతీష్, లింగారెడ్డి, నాగారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. – తాంసి

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా నీటితొట్టి



తలమడుగు: మండల కేంద్రంలోని పశువుల దాహం తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టి నిరుపయోగంగా మారింది. వచ్చే ఎండకాలం వరకు పశువులు నీరు తాగేందుకు ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: ఎంపీవో దిలీప్, ఫోన్: 90008 73509

శివపార్వతుల కల్యాణం



ఊరేగింపుగా తీసుకువస్తున్న శివపార్వతుల విగ్రహాలు



శివపార్వతుల వేషధారణలో చిన్నారులు



గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన వస్త్ర వ్యాపారి మిట్టపల్లి రాజయ్య, రాజమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అతిపురాతనమైన శివాలయంలోని శివలింగానికి లక్ష బిల్వాలతో శాస్త్రోక్తంగా అర్చన నిర్వహించారు. ఆలయ గర్భగుడిలోని దేవతలను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. చిన్నారుల వేషధారణ, భక్తి పాటలు అలరించాయి. – గుడిహత్నూర్

రేషన్ బియ్యం మళ్లీ ఆలస్యం

- ఇప్పుడిప్పుడే రేషన్‌షాపులకు చేరుకుంటున్న బియ్యం
- కార్డుదారులకు తప్పని ఎదురుచూపు



సోన్‌కాస్‌లో రేషన్‌షాపు వద్ద బియ్యం దింపుతున్న కూలీలు

బేల: రేషన్ బియ్యం పంపిణీ ఏ నెలలో ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతినెల ఒకటో తేదీ నుంచి పంపిణీ కావాల్సి ఉండగా.. గత నెలలో 10వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈనెలలో ఇంకా పంపిణీపై ఊసేలేదు. ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని అయోమయం నెలకొంది. ఈనెల ఐదో తేదీ దాటినా.. బియ్యం పంపిణీ ప్రారంభం కాకపోగా, ఇంకా పూర్తిస్థాయిలో రేషన్‌షాపులకు బియ్యం చేరలేదు. దీంతో కార్డుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గత డిసెంబర్ వరకు ఒక యూనిట్ ఉచితంగా 10కిలోలు పంపిణీ చేయగా.. జనవరి నెలలో 5కిలోలకే పరిమితం చేశారు. అలాట్‌మెంట్ ఆలస్యం కావడం వల్లే ఈపరిస్థితి ఏర్పడుతుందని ఎంఎల్ఎస్ పాయింట్ బృందం వారు చెబుతున్నారు.

సరఫరా కాని బియ్యం..

జైనథ్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మండలంలోని రేషన్ షాపులకు బియ్యం సరఫరా ఇంకా పూర్తి కాలేదు. ఈనెలలో ఇప్పటిదాకా మండలంలోని సగం రేషన్ షాపులకు మాత్రమే సరఫరా పూర్తయింది. ఇంకా సగం రేషన్ షాపులకు చేరలేదు. ఇదిలా ఉండగా.. మండలంలో 37గ్రామ పంచాయతీలు న్నాయి. ఇందులో నాలుగు డీఆర్ డిపోలు ఉండగా.. మరో 22 రేషన్ షాపులున్నాయి. మొత్తంగా 11,773 రేషన్ కార్డులున్నాయి. ఇందులో మొత్తంగా 37,794 యూనిట్లు ఉండగా.. ఈనెలకు 2,030.47 క్వింటాళ్ల బియ్యం మంజూరయ్యాయి. మండలంలోని సగం షాపులకు మాత్రమే బియ్యం సరఫరా జరిగింది.

ఎందుకీ ఆలస్యం..

గత సెప్టెంబర్ నెల నుంచి బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. ప్రతినెల ఇదే పరిస్థితి ఉండడంతో పండుగల సమయంలో బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతీనెల 25లోపు అలాట్‌మెంట్ పూర్తయి నెలాఖరులోపు రేషన్ షాపులకు బియ్యం సరఫరా పూర్తి కావాలి. దీంతో ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వరకు రేషన్ పంపిణీ చేపడుతారు. కానీ అలాట్‌మెంట్ ఆలస్యం కావడంతో ప్రజలకు పంపిణీ చేయడం ఆలస్యమవుతోంది. జనవరి నెల నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి ఉచితంగా 5 కిలోలు అందజేస్తామని ప్రకటించింది. దీనిపై గత డిసెంబరు, జనవరి నెల ఖారులో రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా ప్రకటన చేస్తుందేమోనని, స్టాకును రేషన్‌షాపులకు ఒకేసారి పంపవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. దీంతో అలాట్‌మెంట్, బియ్యం సరఫరా ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై మండల పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా.. బియ్యం అలాట్‌మెంట్ ఆలస్యంతో రేషన్‌షాపులకు సరఫరా ఆలస్యమైందన్నారు. అన్ని షాపులకు 7లోపు సరఫరా పూర్తి చేయిస్తామన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఆదివారం బీసీ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాకేర్ల ప్రశాంత్, అధ్యక్షుడిగా శార్ల ప్రమోద్, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శార్ల రవి, ప్రచార కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా నర్సింగ్, సభ్యులుగా దేవర సుభాష్, సతీష్, మోహన్, స్వామి, వెంకట్, అనిల్, శ్రీకాంత్, అశోక్, నారాయణ, తదితరులు ఎన్నుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం..



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆర్యవైశ్య సంఘం ఆదిలాబాద్ పట్టణ నూతన ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, సుహాసినిరెడ్డిలు హాజరయ్యారు.

విశ్వబ్రాహ్మణ మండల కమిటీ..

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవరకొండ రవి, ఉపాధ్యక్షుడిగా రామోజీ చారి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీరాములు బ్రహ్మం, కోశాధికారిగా చందన గిరి విఠల్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రయ్యను ఎన్నుకున్నారు. సంఘం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అధ్యక్షుడు తెలిపారు.

పర్దాన్ పురోహిత్ సమాజ్..



ఎన్నికైన పర్దాన్ పురోహిత్ సమాజ్ సభ్యులు

నార్నూర్: పర్దాన్ పురోహిత్ సమాజ్ మండల కమిటీని ఆదివారం మండలంలోని గుండాల గ్రామంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మెస్రం దాదారావు (గుండాల), ఉపాధ్యక్షుడిగా పెందూర్ దీపక్ (మాన్కాపూర్), ప్రధాన కార్యదర్శి మెస్రం శేషారావు (మహాగావ్), ఉపాధ్యక్షురాలిగా జీవన కళబాయి, గౌరవ అధ్యక్షుడిగా గేడం నిరంజన్ (బలంపూర్), కోశాధికారిగా కోట్నాక్ శ్యాం, సహాయ కార్యదర్శిగా సీడాం శంకర్, తొడసం గంగారాం, సాంస్కృతిక కార్యదర్శిగా మెస్రం మేఘరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ఉపాధ్యక్షుడు పెందూర్ దీపక్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ఇంతెకాబ్ ఆలం అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షకు 135 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ఇంటర్మీడియెట్ విద్యను ఉచితంగా చదివించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జేఈఈ, నీట్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు.

బోరుబావి పనులు ప్రారంభం

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది వైకుంఠ ధామంలో నీటి సౌకర్యం కోసం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బోరుబావి తవ్వకం పనులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడావి ధనలక్ష్మీ, ఉప సర్పంచ్ సంతోష్ గౌడ్, కరాడ్ బ్రహ్మానంద్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఆదిత్య, పీఏసీఎస్ డైరెక్టర్ సంగ ఆశన్న యాదవ్, మెస్రం జలందర్, భీంరావ్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు కౌన్సిలర్ల పరామర్శ

కైలాస్‌నగర్: ఇటీవల ముక్కుకు శస్త్రచికిత్స చేసుకుని, హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను పలువురు కౌన్సిలర్లు ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్‌కు వెళ్లిన కౌన్సిలర్లు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇందులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్లు లక్ష్మణ్, భూమన్న, భరత్, నాయకులు రాజు, రవి, దయాకర్, ఆనంద్, స్వాగత్ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఉట్నూర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నగేందర్‌ను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో శాంతిభద్రతల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన డీఎస్పీ శాంతి భద్రతల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో వైస్ ఎంపీపీ బాలాజీ, దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, తన్నీరు సతీశ్ పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి



బీజేపీలో చేరుతున్న నాయకులు

బోథ్: రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. ఆదివారం మండలంలోని ధన్నూర్‌లో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. ఈనెల 10 నుంచి 25 వరకు బూత్‌స్థాయిలో శక్తి కేంద్రాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ, మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, మాధవరావు, సూర్యకాంత్ గిత్తే, శేఖర్, సోయం వెంకటేష్, పిడుగు అశోక్ రెడ్డి, రామెల్లి భోజన్న, రవీందర్, తూము సంతోష్ పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్'

బజార్‌హత్నూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గొర్ల రాజుయాదవ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ అమలు చేయలేదన్నారు. కేంద్ర పథకాలను, కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వ దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్ యాదవ్, మాధవ్‌రావ్ ఆమ్టే, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సోనటాకే గజానంద్, సర్పంచ్ మడవి ప్రకాష్, కేవల్‌సింగ్, పెరుగు సంతోష్, మేకల లింగన్న, చట్ల వినిల్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడలో నిర్మించిన శ్రీ శివభక్త మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ చంద్రా గోపాలకృష్ణ మఠాధిపతి యోగనంద సరస్వతి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, సర్పంచ్ గంగారాం, అనుముల ఆశన్న, వీరయ్య, మామిడ్ల అలశెట్టి నాగన్న, కట్కం తిరుపతి, జక్కుల రాజు, కట్కం రవి, అశోక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



ఎన్నిక పత్రం అందజేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన ప్రధాన కార్యదర్శి ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. సంఘం అధ్యక్ష పదవికి ముగ్గురు నామినేషన్‌లు దాఖలు చేయగా ఇద్దరు వారి నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో అధ్యక్షుడిగా చిక్కాల దత్తు ఏకగ్రీవమైంది. ప్రధాన కార్యదర్శి పదవికి ఐదుగురు నామినేషన్ వేయగా.. ముగ్గురు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. కలాల శ్రీనివాస్, అసుర హన్మండ్లు యాదవ్‌లు పోటీ పడ్డారు. ఆదివారం జిల్లా బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం సభ్యుల ఓట్లు 68 ఉండగా.. ఇందులో కలాల శ్రీనివాస్‌కు 39, అసుర హన్మండ్లు యాదవ్‌కు 29 ఓట్లు వచ్చాయి. దీంతో కలాల శ్రీనివాస్ 10 ఓట్ల తేడాతో గెలుపొందారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి ప్రభాకర్ స్వామి, నుటంకి సత్యనారాయణ, పిల్లి కిషన్, నవీన్ యాదవ్, జక్కుల శ్రీనివాస్, పసుల ప్రతాప్, పాల్గొన్నారు.

ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: ముందస్తు ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం బీజేపీ బూత్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ ప్ర జలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శక్తి కేంద్ర అధ్యక్షుడు అజయ్, మురళీధర్ టాక్రే, విశ్వంబర్, కార్తీక్, సంతోష్, కిరణ్, దీపక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.60 లక్షలతో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ముందుకు వెళ్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితబస్తీ, దళితబంధు,ఆసరా పంఛన్లు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్ రెడ్డి, ఉప సర్పంచ్ రఘు, ఎంపీటీసీ రఘు, నాయకులు శ్రీధర్ రెడ్డి, లింగారెడ్డి, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోర్డుకే పరిమితం..



వామన్‌నగర్‌లో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

తాంసి: మండలంలోని అంబుగాం గ్రామపంచాయతీ పరిధిలోని వామన్ నగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డుకే పరిమితమైంది. క్రీడాప్రాంగణం కోసం ఎంపిక చేసిన స్థలంలో నామమాత్రంగా బోర్డు ఏర్పాటు చేసి పరికరాల ఏర్పాటును మరిచారు. ఇటువైపు వెళ్లేవారు ఇదేమి క్రీడా ప్రాంగణం అని చర్చించుకుంటున్నారు.